# ఆశ

బయట ఎండ కొంచెం తగ్గింది. అప్పుడే పక్క గదిలోంచి సియస్టా నుండి లేచి వచ్చిన వెంకట్రామయ్యగారికి ఇక ఊపిరి తీసుకోడానికి వ్యవధి ఉండదు. క్రిందకు వెళ్లి ప్రెస్ అంతా వో మాటు చూచి రావాలి. సంపాదకీయం రాయాలి. తీసుకోవలసిన నిర్ణయాలు చాలా ఉన్నాయ్. ఆలోచిస్తూనే క్రిందకెళ్లి నాలుగూ వో మారు చూసి వచ్చేసరికి పోస్టు వచ్చింది. గుమస్తా సార్ట్ చేసి తన సొంత ఉత్తరాలను తన గదిలోకి పంపించాడు.

ఉత్తరాల బొత్తిలో పసుపుబొట్ల కవరు. ముందు అదే తీశారు వెంకట్రామయ్యగారు పెళ్లి ఎవరికా అనుకుంటూ.

బాబాయివద్దనుండి శుభలేఖ.. కొడుక్కి పెళ్లి. పెళ్లి కార్డుమీద బాబాయ్ కనపడుతున్నాడు. తన నెంత ముద్దు చేసేవాడు బాబయ్య! తనకీ బాబయ్యంటే ఎంతో ప్రేమే. తన కంటె సుమారు పదేళ్లు పెద్దేమో? తన నెత్తుకుని ఆడించేవాడు చిన్నతనంలో. బాబాయిని చూచి ఎన్నాళ్లయింది? ఓ మారు వెళ్లివస్తే! అబ్బే తనకు ఊరు కదిలేందుకెక్కడ దొరుకుతుంది అవకాశం!

పెళ్ళి అయిన తరువాత బాబాయిని కొడుకునీ కోడలినీ తీసుకుని హైదరాబాదు రమ్మంటే?

ముందు పెళ్లి పిలుపును గురించి కామాక్షికి చెప్పాలి. "గ్రేస్! కామాక్షిని పిలుస్తావా?" టేబిల్ మీద ఫోన్ తీసి ఆపరేటర్‌కు చెప్పాడు.

భర్తకు క్యారియర్ సర్ది, కొడుకు అరుణకు వడ్డించి తనూ భోజనం చేసి ఓ అరగంట పడుకుందామని తనగదిలో కెళ్లింది కామాక్షమ్మ. అంతే నిద్రపట్టేసింది.

"హలో, ఎడిటర్ వెంకట్రామయ్యగారి ఇల్లు" ఆవులిస్తూ అంది.

"కామాక్షమ్మగారా! పంతులుగారు మిమ్మల్ని పిలవమన్నారమ్మా!"

వెంకట్రామ్మయ్య గారిని కార్యాలయంలోని వారందరూ పంతులుగారని పిలవడం రివాజు. ఈ వేళలో అంత అర్జంటు పనేమిటి చెప్మా అని ఆత్రంగా వింటోంది కామాక్షమ్మ.

బల్లమీద ఫోన్ మోగగానే తీసుకున్నారు వెంకట్రామయ్య "కామాక్షీ, బాబాయి వద్దనుండి ఇప్పుడే శుభలేఖ వచ్చింది. రాజేంద్రుణ్ణి జ్ఞాపకం ఉందా? కృష్ణమూర్తి బాబాయి కొడుకు. ఇన్నాళ్లకి పెండ్లికి ఒప్పుకున్నాడన్న మాట. నారాయణమూర్తి గారని నాన్నగారి స్నేహితుడు. నీకు జ్ఞాపకం ఉందా? అతని కూతుర్ని ఇచ్చి పెళ్ళట ముప్ఫైయవతేదీని. ఇక నాలుగు రోజులే ఉంది పెళ్లి. అరుణని తీసుకుని నువ్వెళ్లరాదూ. ఎలానూ వాడికి పరీక్షలైపోయాయి కదా!

"మీరు రాకూడదూ!"

"నాకెక్కడ తీరిక? ఇక్కడ పత్రికో! నాకైతే రావాలనే ఉంది కాని దేశంలో రాజకీయ పరిస్థితి...విద్యార్థుల అల్లర్లు..."

"సరేలెండి వాటిని గురించి పత్రికలో రాద్దురుగాని" కస్సుమంది. ఎడిటర్ గారికి ఏమనాలో తోచలేదు. కామాక్షమ్మ ఊరికే భర్తమీద విసుక్కుని బుసలుకొట్టే సామాన్య స్త్రీ కాదు.

ఏం మాటాడాలో తోచకా, ఫోన్ పెట్టేసి భార్య మనసు నొప్పించనూ లేక, అడిగారు:

"అరుణ ఏంచేస్తున్నాడూ?"

"భోజనం చేస్తుండగా పక్కవాళ్ల మహేందర్ వచ్చాడు. ఇద్దరూ ఎక్కడికో వెళ్లారు."

"రేపురాత్రె బయలుదేరాలి. కావలసినవన్నీ సర్దుకో. నేను ఏడింటికే ఇంటికొచ్చేస్తా" ఫోన్ పెట్టేసి మళ్లీ తీసారు.

"గ్రేస్! ట్రేడ్‌వింగ్స్‌కి ఫోన్‌చేసి విజయనగరానికి రేపు ఎక్స్‌ప్రెస్‌లో రెండు ఫస్ట్‌క్లాసు బర్త్ బుక్ చేయించు. టిక్కెట్లు ఇంటికి పంపమను. నా ప్రయివేటు ఎకౌంట్‌లో బిల్ చేయమని చెప్పు."

●●●

టేంక్‌బండ్ మీద స్కూటర్ శరవేగంతో పోతోంది.

"ధీరేసే జానాభాయ్!" పిలియన్ మీద కూర్చున్న మహేందర్ అన్నాడు అరుణ చెవిలో.

"చూడ్రా, ఆ టాక్సీవాడి పొగరు, మనకంటె ముందు వెడదామని!" టాక్సీవాడికి సైడ్ ఇయ్యకుండా రోడ్డుమధ్యగా వెడుతున్నాడు. అటునుండి సర్దార్‌జీ లారీ నడుపుకుని వస్తున్నాడు. వాడి స్పీడు చూస్తుంటే అరుణకే భయం వేసింది. చటుక్కున గేరుమార్చి ఎడమకు తప్పుకుని లారీ వెళ్లగానే మళ్లీ రోడ్డు మధ్య కొచ్చాడు.

అరుణని మాటాడిస్తే మరీ ప్రమాదమని నోరుమూసుకు కూచున్నాడు మార్వాడీ మహేందర్.

కిశోర్ ఇంటిలో కలసిన మిత్రులకు ఊక దంపుడులో కాలం తెలియటంలేదు. "రేయ్ మహేందర్, నువ్వేం చెయ్యాలనుకుంటున్నావ్ రా?" సడన్‌గా అడిగాడు కిశోర్.

"అరెయార్, ఇప్పుడెందుకురా ఆ గొడవంతా, రిజల్ట్స్ రానీయ్."

"వాడికేంరా, వాళ్ల నాన్న బిజినెస్‌లో దూరిపోతే సరి" అన్నాడు కరుణ.

"నీ మొహం. ఏడిశావ్, నాకు పితాజీ బిజినెస్‌తో క్యా జరూరత్, ఓ చిన్న ఫ్యాక్టరీ పెట్టుకుంటాను."

"అది మరీ మంచిదిరా, మరో పది మందికి ఉపాధి కల్పించినట్టవుతుంది. నన్ను జనరల్ మేనేజర్‌గా వేసుకో. నెలకు వెయ్యి చాలు." మాష్టారి అబ్బాయి ప్రసాద్ అన్నాడు.

"పాపం మనవాడు అల్ప సంతోషి!" అరుణ కామెంట్ చేశాడు.

"ఒరేయ్ అరుణా నువ్వేం చెయ్యాలనుకుంటున్నావ్ రా?" కిశోర్ అడిగాడు.

"నేనా, నాకేం చెయ్యాలని లేదు".

"వాడికేంరా. కుసుమ్‌ని పెళ్లాడి సంసారం చేసుకుంటే చాలు. ఆమె ద్రాక్ష తోటలన్నీ వాడివే. వ్యవసాయం మనవాడికి పట్టుబడాలి కాని"...సాగదీశాడు తెలివిగా ప్రసాద్. కుసుమ్ అనగానే ఒళ్లు గగుర్పొడిచింది అరుణకి. వాచీ చూసుకున్నాడు నాలుగే అయింది. ఆరింటికి వస్తాను రెడీగా ఉండమని చెప్పాడు ఆమెకి.

కుసుమ్ తండ్రికి ఒక్కర్తే కూతురు. కాబోయే అల్లుడే ఆసరా కావాలనుకుంటున్నాడు ముసలాయన. చాలా మర్యాదస్తుడు. మంచివాడు.

ఒరేయ్ ఇవాళ మనమంతా ఏడింటికి సరోజినీదేవి రోడ్‌లో నియోరిట్జ్‌లో ములాకత్ కావాలి. చాల రోజులైంది బార్‌కి పోయి. వెధవ పరీక్షలు...హడావుడి. ఓమారు ఖుషీ చెయ్యాలి.

ప్రసాద్, అరుణ సాంగత్యంతో తెలుగు బాగా పట్టుబడింది మహేందర్‌కి.

అరుణ ఆలోచనలకి ఆకస్మికంగా అవరోధం కలిగింది. "మొన్ననే అమ్మ దగ్గర ఓ వంద

తీసుకున్నారా...మరి ఇవ్వదు" నిట్టూర్చాడు.

"అరెభాయ్, ఇస్‌మేక్యాహై. మత్‌గభ్‌రావ్. పైసా మేరా పాస్ హై!"

"పైసా కాదురా చిట్టి తండ్రీ, ఇవాల్టికి నన్నొదిలెయ్యండి. నాకు వేరే పనుంది." ఎలా బయటపడాలో తోచలేదు అరుణకి.

"బోధ పడిందిలేరా!" కిశోర్‌గాడు వెధవ. ఊరుకో రాదూ, విసుగ్గా ఉంది అరుణకి.

"క్యా మత్‌లబ్, కుసుమ్‌కే వాస్తే క్యా?"

మిత్రులంతా నవ్వారు.

కామాక్షమ్మ మనసు గ్రామం మీదకు పోయింది. గ్రామం వెళ్ళి ఎన్నాళ్లయిందీ! మళ్లీ అందరినీ చూడొచ్చు. ఎంత హైదరాబాదు జీవితానికి అంకితమై పోయినా మళ్లీ స్వగ్రామంలో ఓ వారం రోజులుండాలంటే ఎంత ఉత్సాహం!

అన్నయ్య పద్మనాభం కూడా పెళ్ళికి వస్తాడు. వాడికేం మహారాజు. ఇల్లు కదలవలసిన అవసరం లేదు. అధవా వ్యాపారీత్య ఎక్కడికైనా వెళితే మూడోరోజు రాత్రికి తిరిగి వచ్చేస్తాడు. నిర్మల ఎలాగైనా అదృష్టవంతురాలు.

అనురాధ ఎలా ఉందో! అనూరాధ ఇప్పుడు పెళ్లి కూతుర్ని పెంచుకున్న తల్లి, నారాయణమూర్తిగారి భార్య, పాపం అనూరాధ. తను కాపురానికి వచ్చేసరికే అనూరాధకు పాతికేళ్లు పైబడ్డయ్.

పిల్లలకోసం ఎన్ని నోములూ, వ్రతాలూ, చేసిందనీ! కనబడ్డ ప్రతిరాయికీ, రప్పకీ పుట్టకీ, గట్టుకీ మొక్కింది. అభిషేకాలు చేయించింది. పూజలు చేసింది. తీర్థాలు సేవించింది. బొత్తిగా సత్తికాలపు మనిషి.

నారాయణమూర్తిగారు కొద్దిగా చదువుకున్నారు.!

మంత్రాలని చింతకాయలు కొట్టలేని శబ్దాలని తీసిపారెయ్యక పోయినా, ఎందుకేనా మంచిదని పెద్ద పెద్ద డాక్టర్లను సంప్రదించారు. దంపతులిద్దరూ ఏవేవో మందులు వాడారు. అనూరాధ ఆపరేషన్ చేయించుకుంది. లాభం లేకపోయింది. మానసికంగా కుంగిపోయారు దంపతులు. పోనీ వారు పెంచుకున్న ఈ అమ్మాయికైనా సంతానం కలిగితే వారి లోటు కొంత తీరుతుంది.

క్రింద స్కూటర్ శబ్దం.

"అమ్మా రాత్రి సినిమా కెళుతున్నాం. నేనొచ్చేసరికి ఆలస్యం అవుతుంది."

"సినిమా సరేలేరా, బట్టలుసర్దుకో, గంట్యాడ తాతగారింటికి వెళదాం. రాజేంద్రుడి పెళ్లట, నాన్నగారు చెప్పారు."

"గంట్యాడా, పెళ్లికి నేనెందుకమ్మా, నువ్వెళ్లరాదూ, నాకు చాలా పనులున్నాయ్. ఫ్రెంచిక్లాసులు పోతాయ్. నేను రావడానికి వీలుకాదమ్మా!" తువాలు తీసుకొని బాత్‌రూమ్‌లోకి వెళ్లి పోయాడు.

ఇంటిదగ్గర కామాక్షమ్మ మనసుతోబాటు ఆఫీసులో అర్జంటుగా సంపాదకీయం రాయాల్సిన వెంట్రామయ్యగారి మనసు కూడా గతంలోకి పోయింది.

నాన్నగారంటే తనకెంతో భయం. బాబాయి తన నెంతో గారంగా చూసేవాడు. తమ స్కూల్లో చదివేరోజుల్లో తన మీద ఈగవాలనిచ్చేవాడు కాదు. ఊళ్లో తనసైజు కుర్రకాయలందరికీ బాబాయంటే హడల్.

తను చిన్నప్పటినుంచీ భావ ప్రపంచలోనే విహరించేవాడు. పిల్లలందరితోనూ కలిసి ఆటలాడడం

తనకు చేతకాని పని. తనలాగే దూరంగా కూచునే మరో పిల్లవాడుండేవాడు గుర్నాధం అని. ఇప్పుడెక్కడున్నాడో! అతన్ని మిగిలిన పిల్లలంతా బాగా ఏడిపించేవారు. క్లాసులో అతని పుస్తకాలు మాయమైపోతూ ఉండేవి. కంపసు బాక్సులో ఉండవలసినవి ఉండేవికావు. పుస్తకాల మీద, ముఖ్యంగా కాంపొజిషన్ పుస్తకంమీద ఇంకుసీసా బోరిగిల పడుతూ ఉండేది.

అన్నిటికీ అందరూ మేష్టారు వద్ద గుర్నాధం మీదే రిపోర్ట్ చేసేవారు. ఇలా అల్లరిపట్టించే కుర్రాళ్లు తనజోలికి మాత్రం వచ్చేవారుకారు. తను ఎక్కడో కూచుని చదువుకుంటుండేవాడు.

"ఆ కృష్ణమూర్తి చంపేస్తాడ్రోయ్!" అంటూ తన జోలికి మాత్రం వచ్చేవారుకారు...ఈ పెళ్లి కెలా వెళ్లడం?

తన కాలం తన చేతిలో లేదు. పత్రికా తన సర్వసం అయికూచుంది. సుమారు ఇరవై ఏళ్లయింది తను హైదరాబాదు వచ్చి. ఎప్పుడూ మూడురోజులు మించి స్వగ్రామం వెళ్లలేక పోతున్నాడు. అదైనా నాలుగైదేళ్ల కొకసారి.

పత్రిక మీద తనకు పూర్తి పెత్తనం వచ్చిన దగ్గరనుండీ ఊరు కదలడమే కష్టంగా వుంది

అమ్మనీ, నాన్నగారినీ చూసి యెన్నాళ్లయింది? వాళ్లే యెప్పుడైనా యిటు రావడం కాని తనెప్పుడైనా వెళ్లి వాళ్లతో ఓ నెల రోజులున్నాడా?

ఇదిగో మరో రెండేళ్లు, తనింక రిటైరై పోవాలి. అరుణ ఎం.ఏ. పూర్తి అయితే ఓ సంవత్సరం జర్నలిజం చదివించి తనదగ్గరే కొన్నినెలలపాటు తరిఫీదిచ్చి మెల్లగా వానప్రస్తం పుచ్చుకోవాలని ఆశ. కొడుకు పెద్దయి కాలేజీ క్లాసులోకి వచ్చినప్పటినుండీ తన కదే ఆరాటం.

ఆలోచిస్తూ ఉత్తరాలు-తిరగేస్తుండగా నాన్నగారి దస్తూరీతో కార్డు. చి. వెంకట్రామయ్యకు.

నాన్న ఆశీర్వచనములు. ఉభయకుశలోపరి. కృష్ణమూర్తి కొడుక్కి 30 వ తేదీన పెళ్లి. చాల రోజులనుండి అనుకుంటున్న సంబంధమైనా ఇంత జరూరుగా పెళ్లి జరుగుతుందని అనుకోలేదు. కాల వ్యవధి లేదు. కోడలినీ, అరుణనీ తీసుకుని తప్పకుండా రా. ముసలివాళ్లమయి పోతున్నాం. నీ పేరుకోసం కన్నవాళ్లను వదిలేస్తావా? మీ అమ్మ ఆరోగ్యం బాగులేదు. చూడాలని ఉందని మరీ మరీ రాయమంది.

నాన్న

నాన్నగారికి తనేం చెయ్యగలిగాడు?

అంత పొలాన్ని ఒక్కరే చూసుకుంటూ నానా యాతనా పడుతున్నారు. అమ్మకి కన్ను ఆపరేషన్ అని రాస్తే ఐదేళ్లక్రితం విశాఖపట్నం వెళ్లి ఆస్పత్రిలో ఉన్న అమ్మని ఓ గంట చూసి మళ్లీ విమానం ఎక్కేశాడు. వాళ్ల కడుపునపుట్టి తనువాళ్లనేం సుఖపెట్టినట్టు?

మనసులో ఆరాటపడుతుంటూ తన కోరిక, తన ఆశా జ్ఞాపకం వచ్చాయ్. తన కొడుకు తన వృత్తిని స్వీకరించి తనకు కొంత భారాన్ని తగ్గిస్తాడని తనెంత ఆశిస్తున్నాడు? తన తల్లి దండ్రుల ఆశ తనేం తీర్చేడని తన కొడుకుమీద తనకంత ఆశ?

"ఆశా, ఆకలీ, అందరిదీ ఒకటే"

బామ్మ మాటలు జ్ఞాపకం వచ్చాయ్.

ఛీ, తన జీవితం వ్యర్థం!

"అయ్యగారూ, డిక్టేషన్ తీసుకోడానికి రమ్మంటారా అని శేఖర్ బాబుగారడుగుతున్నారు."

మెల్లగా జవాను చెప్పాడు సొంతం గదిలోకి రాకుండానే.

"ఈవేళ నా వంట్లో బాగులేదు. శేషయ్యగారి దగ్గరకు వెళ్లమని చెప్పు."

బొంగురుపోతున్న గొంతుతో సమాధానం చెప్పి కండువాతో కళ్లు తుడుచుకున్నారు వెంకట్రామయ్యగారు.

భారతి 1975-76